
ఎన్నికల ప్రచారంలో కోట నీలిమ

కాంగ్రెస్ మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు మేలు

సనత్‌నగర్: అన్ని వర్గాలకు మేలు జరిగే విధంగా కాంగ్రెస్ మేనిఫెస్టో రూపొందించడం జరిగిందని ఆ పార్టీ సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి కోట నీలిమ అన్నారు. అమీర్‌పేట డివిజన్ పరిధిలోని బుద్ధనగర్, అంకమ్మ బస్తీ, సిక్‌వాడి తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందంటే మాటపై నిలబడి తప్పకుండా అమలు చేస్తోందన్నారు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో సైతం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలుచేసి ప్రజల మన్ననలను పొందడం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రకటించిన మేనిఫెస్టోతో ప్రజలకు తమపై పూర్తి విశ్వాసం కలిగిందన్నారు. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ తేదీలతో సహా ప్రకటించామని, ఆ దమ్ము ఏ పార్టీలకూ లేదన్నారు. గత తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుందని విమర్శించారు. సమసమాజ నిర్మాణం జరగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యపడుతుందన్నారు. అనంతరం బీకేగూడ మసీదు సమీపంలో ఆమె ప్రచారం నిర్వహించారు. మైనార్టీల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేసే పార్టీ ఒక్క కాంగ్రెస్సే అన్నారు. అన్ని పార్టీలు మైనార్టీలను ఓటు బ్యాంక్‌గా వాడుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ మాత్రమే వారి సంక్షేమం కోసం పాటు పడుతుందన్నారు.

ప్రచారానికి పిల్లలను తీసుకెళ్లడం నిషేధించాలి


వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

అడ్డగుట్ట: ఎన్నికల ప్రచారంలో పిల్లలను తీసుకెళ్లడం నిషేధించాలని తెలంగాణ తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి శుక్రవారం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారాల్లో పిల్లలను తీసుకెళ్తుండటంతో వారు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, తొక్కిసలాట వంటివి జరిగిన సమయంలో ప్రాణనష్టం కూడా జరిగే ప్రమాదం ఉందన్నారు. 18 ఏళ్ల కన్న తక్కువ వయస్సు ఉన్న బాలలను ప్రచారంలో తీసుకెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని రాజకీయ ర్యాలీలు, పెద్ద సమావేశాలలో పిల్లల ప్రమేయాన్ని నిషేధించాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ గంజి వేణుగోపాల్, సీహెచ్. లక్ష్మీనారాయణ, సభ్యులు రామలీల, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

చేనేత వస్త్ర ప్రదర్శనకు స్పందన


వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

లాలాపేట: తార్నాకలోని ఐఐసిటి స్టాఫ్ క్లబ్‌లో కళాసిల్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనకు స్పందన వస్తోందని నిర్వాహకులు వికాస్ జైన్ తెలిపారు. నగర ప్రజల అభిరుచి మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత కళాకారులు స్వయంగా తయారు చేసిన వివిధ రకాల వస్త్రాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ నెల 27వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతోందని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'గాంధీ'లో రోగులకు దుప్పట్ల వితరణ


దుప్పట్లు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ (320–బీ)దుప్పట్లను పంపిణీ చేసింది. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రేసు మల్లారెడ్డి, మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ లింగమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం సుమారు 500 మంది రోగులకు దుప్పట్లను అందించి తమ ఉదారత చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుడూ.. ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ 320–బీ నేతృత్వంలో అనేక సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టి కొనసాగిస్తున్నామన్నారు. చలికాలం ప్రారంభమైన నేపథ్యంలో నిరుపేద రోగులకు చలి నుంచి రక్షణ కల్పించేందుకు దుప్పట్లను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ గవర్నర్ లయన్ సాయిరామ్‌రాజు, లయన్ హర్భేంద్రసింగ్, అరుణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీతోనే సంపూర్ణ అభివృద్ధి

సనత్‌నగర్: బీసీల సంక్షేమం కోసం ఆలోచించి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించిన ఏకైక పార్టీ బీజేపీనేని ఆ పార్టీ సనత్‌నగర్ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన ఎస్‌ఆర్‌నగర్‌లోని సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ.రమణను కలిసి ఓటు అభ్యర్థించారు. శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలు నేడు భారత్ వైపు చూస్తున్నాయంటే నరేంద్రమోదీ పరిపాలనాదక్షతే కారణమన్నారు. రాష్ట్రంలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తే సంపూర్ణ అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు.

ప్రొ.నజియా సుల్తానాకు అవార్డు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అధ్యాపకురాలు ప్రొ.నజియా సుల్తానాకు ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా అవార్డు లభించింది. గత నెల 19న దుబాయ్‌లో చార్టర్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్నేషనల్ రీసెర్చ్ అవార్డ్స్‌కు 162 మంది పోటీ పడ్డారు. అందులో ఎకనమిక్స్ విభాగంలో వెండి పతకాన్ని డాక్టర్ నజియా సుల్తానా దక్కించుకున్నారు. స్వయం ఆధారిత ఆర్థిక వ్యవస్థను సృష్టించడానికి ఇన్నోవేటివ్ ఎంటర్ ప్రైజెస్‌ను ఇంక్యుబేటింగ్ చేయడంలో సపోర్టివ్ పాలసీ ఇంటర్ వెన్షన్ అనే పరిశోధన పత్రానికి అవార్డు లభించినట్లు ఆమె తెలిపారు.

లాస్య నందితను గెలిపించండి

రాంగోపాల్‌పేట్: కంటోన్మెంట్ నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్య నందితను గెలిపించాలని జీహెచ్‌ఎంసీ కోఆప్షన్ మాజీ మెంబర్ నరసింహారావు ముదిరాజ్ కోరారు. శుక్రవారం రెజిమెంటల్‌బజార్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటికి తిరుగుతూ లాస్యకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే రాబోతుందని కంటోన్మెంట్‌లో కూడా లాస్య నందిత విజయం సాధించబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్ ముదిరాజ్, శేఖర్ ముదిరాజ్, నీలాంకర్, సతీష్, రాము, గౌరి శంకర్, సందీప్‌కుమార్, రామ్మోహన్, కిష్టఫర్, సాయి కిరణ్, నవీన్ పాల్గొన్నారు.

ఘనంగా అన్నకోటి



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ జనరల్‌బజార్‌లోని లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో శుక్రవారం అన్నకోటి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది కార్తీక మాసంలో వచ్చే శుద్ధ పంచమి రోజు అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం అన్నకోటి కార్యక్రమం నిర్వహించారు. ప్రసాదాన్ని నైవేద్యంగా స్వామివారికి సమర్పించిన అనంతరం భక్తులకు పంచిపెట్టారు. బీజేపీ సనత్‌నగర్ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ప్రసాదాలు స్వీకరించారు. అనువంశిక ధర్మకర్తలు గుమిడెల్లి శ్రీనివాస్, రవీందర్, నర్సింగ్‌రావు, దయానంద్‌రావు పాల్గొన్నారు.

- ఆక్రమణదారుల ఓట్లు తొలగించిన బోర్డు
- రెండు దశల్లో 45 వేల మంది ఓట్ల తొలగింపు
- విలీనం జరిగితే అస్తిత్వానికే ఎసరు
- స్పష్టమైన హామీ ఇవ్వని పాలకపక్షాలు


రక్షణ స్థలంలో వెలిసిన మడ్‌ఫోర్ట్‌లోని ఓ బస్తీ

భూబదలాయింపే అసలు సమస్య!

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్.. ఆర్మీ కనుసన్నల్లో ఉండే ఈ ప్రాంతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర పరిమితంగానే ఉంటోంది. ఈ నేపథ్యంలో ఇటు కేంద్రం, అటు రాష్ట్రం పట్టించుకోకపోవడంతో ఇక్కడి ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కూడా అతికష్టం మీద సమకూరుతున్నాయి. సంక్షేమం మినహా అభివృద్ధికి నోచుకోని కంటోన్మెంట్ వాసులకు కొన్నేళ్ల క్రితం సుప్రీం కోర్టు భారీ షాక్ ఇచ్చింది. ప్రభుత్వ ఆక్రమిత స్థలాల్లో నివాసముంటున్నరనే నెపంతో కంటోన్మెంట్ పరిధిలో భారీ సంఖ్యలో ఓట్లను తొలగించింది. ఎన్నికల కమిషన్‌తో సంబంధం లేకుండా బోర్డు ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం లేకుండా చేసింది. దశల వారీగా 45 వేల పైచిలుకు మంది బోర్డు ఎన్నికల్లో ఓటుకు దూరమయ్యారు. ఈ విషయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలోని అధికార పార్టీ బీఆర్‌ఎస్ ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకోవడం మినహా సమస్యకు తగిన పరిష్కారం చూపలేదు. తాజాగా కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే ప్రక్రియ వేగవంతంగా సాగుతున్న నేపథ్యంలో ఆయా ఓటర్ల నివాసాలను తొలగించే ప్రమాదం లేకపోలేదు. భూబదలాయింపుతోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిసినప్పటికీ అధికార పార్టీలు అడుగు కూడా ముందుకు వేయపోవడం దారుణమని ప్రజలు వాపోతున్నారు.

బస్తీల ప్రస్థానమిదీ..

సుమారు పదివేల ఎకరాల్లో విస్తరించిన కంటోన్మెంట్‌లో ఏడువేల పైచిలుకు ఎకరాల స్థలం ఆర్మీ ఆధీనంలోనే ఉంది. మిగిలిన 2800 ఎకరాల్లో మాత్రమే 400కు పైగా కాలనీలు, బస్తీలు వెలిశాయి. వీటికి తోడు ఇక్కడి రక్షణ, పౌర విమానయాన శాఖకు చెందిన స్థలాల్లోనూ పలు బస్తీలు ఏర్పడ్డాయి. గుడిసెలతో మొదలైన ఆయా బస్తీల ప్రస్థానం పక్కా ఇళ్ల నిర్మాణం వరకూ సాగింది. అడపాదడపా మిలటరీ అధికారులు బెదిరింపులు, గుడిసెల తొలగింపుతో కాలం వెళ్లదీస్తున్నారు.

వర్తించని 58 జీఓ..

2014లో తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక మరుసటి ఏడాదే ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన బస్తీల క్రమబద్ధీకరణకు ప్రత్యేకంగా జీఓ నెం. 58 జారీ చేసింది. ఈ మేరకు 125 గజాల్లోపు నిర్మాణాలన్నింటినీ ఉచితంగానే క్రమబద్ధీకరిస్తూ ఆయా ఆక్రమణదారులకు పట్టాలు ఇచ్చే ప్రక్రియ చేపట్టారు. అయితే కంటోన్మెంట్ పరిధిలోని రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖల ఆధీనంలోని బస్తీలకు ఈ జీఓను వర్తింప చేయలేకపోయారు. దీంతో 2015 బోర్డు ఎన్నికల్లో అప్పటి మంత్రులు ఎయిర్‌పోర్ట్ భూముల్లో వెలిసిన రసూల్‌పురా పరిధిలోని 20 బస్తీలతో పాటు, రక్షణ భూముల్లోని బస్తీల స్థలాలను భూబదలాయింపు ద్వారా పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే అందుకు అనుగుణంగా కేంద్రానికి ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదు. దీనికి తోడు 58 జీఓ కింద క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న సుమారు 10వేల దరఖాస్తులను తిరస్కరించింది.

ఓట్ల తొలగింపుతో మళ్లీ తెరపైకి..

2017లో సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు కంటోన్మెంట్‌లో తొలి దశలో 28514 మంది, మరు ఏడాది మరో 16వేల మంది ఓట్లు తొలగించారు. దీంతో బీఆర్‌ఎస్, బీజేపీ నేతల మధ్య పరస్పర ఆరోపణల పర్వం మొదలైంది. భూబదలాయింపునకు కేంద్రం సహకరించడం లేదంటూ 2018 ఎన్నికల సందర్భంగా ఏకంగా మంత్రి కేటీఆర్ ఆరోపించారు. అయితే కేంద్రం భూబదలాయింపునకు సిద్ధంగా ఉందంటూ రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖను బీజేపీ నేతలు బహిర్గం చేస్తూ ప్రతి విమర్శలకు దిగుతున్నారు. తీరా ఎన్నికలు ముగియడంతో ఈ అంశాన్ని ఇరుపార్టీలూ మర్చిపోయాయి. తాజాగా మళ్లీ ఎన్నికలు రావడంతో భూబదలాయింపు అంశం తెరపైకి వచ్చింది. బోర్డు ఎన్నికల్లో ఓట్లు కోల్పోయిన వారికి అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు ఉండటం బీఆర్‌ఎస్, బీజేపీతో పాటు కాంగ్రెస్‌లు వారి ఓట్ల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాయి. మొత్తం ఓటర్లలో సుమారు 20 శాతం మంది భూబదలాయింపు పరిధిలోని ఓటర్లు కావడంతో వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాయి. ఈ సారైనా ఆయా పార్టీలు బాధితులకు స్పష్టమైన పరిష్కారం చూపుతాయో లేదో వేచి చూడాల్సిందే.

ఓయూలో నాగుల చవితి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ ఎదుట గల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి భక్తులు నాగదేవత విగ్రహానికి పాలు పోశారు. ఓయూ విద్యార్థినులతో పాటు ఇతర మహిళలు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.

గ్యారంటీ లేని కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరు

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్


ఎన్నికల ప్రచారంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: రాష్ట్రంలోని కాంగ్రెస్ నాయకులకే గ్యారంటీ లేదని, వారు చెప్పే గ్యారంటీలను ఎవరు నమ్ముతారని బీఆర్‌ఎస్ పార్టీ సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ సుభాష్ నగర్, సాయిబాబానగర్, జైప్రకాష్‌నగర్, కై లాష్‌నగర్‌లో శుక్రవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారంతో ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయలేక చేతులెత్తేశారన్నారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నందున మూడోసారి తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. మంత్రి వెంట కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, శేఖర్, ఖలీల్, బాలరాజ్, సరాఫ్ సంతోష్, నోమాన్, సురేష్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రాజేష్, పుష్పలత పాల్గొన్నారు.

- సనత్‌నగర్ సౌభాగ్యనగర్, తులసీనగర్, రాజరాజేశ్వరినగర్ వాసులు ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో మంత్రి మాట్లాడారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో అభివృద్ధి అంటూ జరిగిందంటే అది తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే అన్నారు. సొంత ఇల్లు లేని నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చాలనే సీఎం కేసీఆర్ ఆలోచనల మేరకు అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను నిర్మించామన్నారు. ప్రతిపక్ష అభ్యర్థుల్లో ఒకరు గతంలో గెలిచినా ఎన్నికల అనంతరం ప్రజలకు అందుబాటులో ఉండేవారు కాదని.. ఇంకో అభ్యర్థి స్థానికేతరురాలని, ఆమెకు నియోజకవర్గంపై కనీస అవగాహన కూడా లేదన్నారు.
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ తమ సంపూర్ణ మద్దతు తెలిపింది. మంత్రిని కలిసిన వారిలో ఉమామహేశ్వర్, సయ్యద్, రఘు, ప్రశాంత్, అల్తాఫ్ పాల్గొన్నారు

అందుబాటులో ఉన్నా.. ఓటుతో ఆదరించండి..

బన్సీలాల్‌పేట్: నియోజకవర్గ వాసులకు నిరంతరం అందుబాటులో ఉన్నా.. ఓటు ఆదరించాలని మంత్రి తలసాని అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్‌లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గతంలో అనేక మంది ప్రజాప్రతినిధులు ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన ప్రజా సమస్యలను పట్టించుకోలేదన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలను సనత్‌నగర్‌లో అమలు చేసిన ఘనత బీఆర్‌ఎస్‌కు దక్కుతుందన్నారు. ఎన్నడూ రానివాళ్లు.. ప్రజలకు కోసం ఆలోచించని వాళ్లు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వస్తున్నారని ప్రజలు ఆలోచించి కారు గుర్తుకు ఓటేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏసూరి సావిత్రి, నాయకులు వెంకట్ ముదిరాజ్, సుధాకర్, ఏసూరి మహేష్, సురేష్, రాంబాబు, శ్రీకాంత్‌రెడ్డి, గజ్జెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు పెద్దపీట..


ముస్లిం మైనార్టీలను కలిసిన మంత్రి తలసాని

రాంగోపాల్‌పేట్: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మాత్రమే ముస్లిం మైనార్టీల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ అనంతరం నల్లగుట్ట మసీదు వద్ద వారిని కలిసి ఈ ఎన్నికల్లో త నను గెలిపించాలని అభ్యర్థించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సనత్‌నగర్ నియో జకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేశారు. అనంతరం ముస్లిం మైనార్టీ సోదరులు ఆయనను ఘనంగా సత్కరించి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, యాసిన్, రషీద్, షకీల్, ఇమ్రాన్, షఫీ, లతీఫ్ ఉన్నారు.

నా హ్యాట్రిక్‌ను ఎవరూ ఆపలేరు


నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న పద్మారావు గౌడ్

పద్మారావుగౌడ్

చిలకలగూడ : తెలంగాణలో మరోమారు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు, సికింద్రాబాద్‌లో తన హ్యాట్రిక్‌ను ఎవరూ ఆపలేరని ఆ పార్టీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు.సీతాఫల్‌మండి, బౌద్ధనగర్, మెట్టుగూడ డివిజన్ల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం శుక్రవారం సీతాఫల్‌మండిలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలప్పుడే కనిపించి తర్వాత ముఖం చాటేసే వారికి ప్రజలు సరైన రీతిలో బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ సమస్యలు పరిష్కరించి ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేశారని, వారి శ్రమ వృథాగా పోదన్నారు. రానున్న ఎన్నికల్లో మెజార్టీని మరింత పెంచేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

కేటీఆర్ రోడ్‌షోకు భారీ జన సమీకరణ...

ఈ నెల 18 (నేడు) జరిగే మంత్రి కేటీఆర్ రోడ్‌షో, సభలకు భారీ జనసమీకరణ చేపట్టాలని కోరారు. శనివారం సాయంత్రం 6 గంటలకు అడ్డగుట్ట రియో పాయింట్ వద్దకు చేరుకుంటారని, అక్కడ సుమారు 25 వేల మందితో స్వాగతం ఏర్పాట్లు చేపట్టామని, అక్కడి నుంచి మెట్టుగూడ, చిలకలగూడ చౌరస్తా మీదుగా మైలార్‌గడ్డ ఎస్వీఎస్ పాయింట్ వద్ద కేటీఆర్ రోడ్‌షో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, సునీత, శైలజ, నాయకులు రామేశ్వర్, కిరణ్, కిషోర్, త్రినేత్ర, నోముల ప్రకాశరావు, కరాటే రాజు, కంది నారాయణ, సంగీత్, చంద్రశేఖర్, రాజేష్, సంజయ్ పాల్గొన్నారు.

'డబుల్' బాధితులకు న్యాయం చేయండి


విలేకరులతో మాట్లాతున్న శ్రీగణేశ్

కంటోన్మెంట్: మారేడుపల్లి 'డబుల్' ఇళ్ల కేటాయింపులో అవకతవకల అంశం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్య నందితపై బీజేపీ అభ్యర్థి శ్రీగణేశ్ సంచలన ఆరోపణలు చేశారు. శుక్రవారం మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, బాధితులతో కలిసి మారేడుపల్లి డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయం వద్ద విలేకరులతో మాట్లాడారు. ఇళ్లు ఇప్పిస్తామని అమాయకుల నుంచి లాస్య నందిత డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపించారు. మూడు రోజుల్లో బాధితులకు డబ్బులు తిరిగి ఇవ్వకుంటే వారి తరపున తాము పోరాటానికి సిద్ధమన్నారు. మారేడుపల్లిలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం స్థలం ఇచ్చిన నిజమైన లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు కేటాయించాలన్నారు. సుమారు 140 మంది లబ్ధిదారులు ఇప్పటికీ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారని మంత్రి తలసాని జోక్యం చేసుకుని తక్షణమే సమస్యను పరిష్కరించాలన్నారు.

వట్టిపల్లి మాస్టారు సేవలు మరువలేనివి


వట్టిపల్లి మాస్టారు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

చిలకలగూడ : అమరావతి విద్యాసంస్థల వ్యవస్థాపకులు, విద్యాదాత వట్టిపల్లి కోటేశ్వర రెడ్డి పదో వర్ధంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీతాఫల్‌మండి అంబేడ్కర్ చౌరస్తాలోని వట్టిపల్లి మాస్టారు విగ్రహానికి అమరావతి విద్యాసంస్థల నిర్వాహకులు, పూర్వ విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వట్టిపల్లి మాస్టారు భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. అనేక మంది నిరుపేదలకు ఉచితంగా విద్యను అందించి, వారి పురోభివృద్ధికి దోహదపడ్డారని, అమరావతి విద్యార్థులు దేశవిదేశాల్లో ఉన్నత పదవుల్లో సేవలు అందిస్తున్నారని గుర్తు చేసుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రతినిధులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ప్రసన్నలక్ష్మీ, కవితారెడ్డి, వీణారెడ్డి, సిబ్బంది మంగళ మేడం, దశరథ్ పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం


సుశీల

రాంగోపాల్‌పేట్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం. ఎస్డీరోడ్‌లోని బర్ధన్ కాంపౌండ్‌కు చెందిన సుశీల (80) కుమారుడితో కలిసి ఉంటుంది. ఈ నెల 13న మధ్యాహ్నం సాయంత్రం బయటకు వెళ్లిన ఆమె ఎంతకీ ఇంటికి రాలేదు. తెలిసిన వాళ్లు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్ నాగేశ్వర్‌రావు కథనం ప్రకారం.. అమ్ముగూడ–మౌలాలి రైల్వే స్టేషన్ల మధ్య సుమారు 50–55 మధ్య వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు లైట్ పింక్ కలర్ టీషర్ట్, నేవీ బ్లూ ట్రాక్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఆగిఉన్న కారులో మంటలు


దగ్ధమవుతున్న కారు

రాంగోపాల్‌పేట్: పార్కింగ్ చేసిన కారులో మంటలు చెలరేగి దగ్ధమైన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా గత నాలుగేళ్ల నుంచి ఒక నానో కారు పార్కింగ్ చేసి ఉంది. ఉన్నట్లుండి శుక్రవారం సాయంత్రం కారులో నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలు ఆర్పేందుకు యత్నించినా అదుపులోకి రాలేదు. కారు మొత్తం దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందా.. ఎవరైనా కాల్చిన సిగరెట్ వేయడంతో జరిగిందా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

బీజేపీ విజయానికి కృషిచేస్తా


బండ కార్తీకరెడ్డి నివాసంలో బీజేపీ నేతలు

లాలాపేట: బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి స్పష్టం చేశారు. సికింద్రాబాద్ నుంచి టికెట్టు ఆశించి భంగపడ్డ ఆమె గత కొన్ని రోజుల నుంచి అలకబూని పార్టీకి దూరంగా ఉంటున్నారు. శుక్రవారం సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి రామస్వామి తదితరులు తార్నాకలో బండా కార్తికరెడ్డి నివాసంలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై వివరించారు. మీకు జరిగిన అన్యాయంపై పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు.మీ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఇన్‌చార్జిలు విష్ణువర్ధరెడ్డి, ఇచ్చిన హామీలతో తాను తిరిగి పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తానన్నారు. ఈ సమావేశంలో బండా చంద్రారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వీరన్న, సంపత్, కెఎస్‌ఆర్, మునుస్వామి, చరణ్, రాజ్‌కుమార్, కృష్ణ, రాజేష్, సంతోష్ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన అభ్యర్థిపై కేసు

రాంగోపాల్‌పేట్: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తూ టపాకాయలు కాల్చిన తెలంగాణ రాజ్య సమితి (టీఆర్‌ఎస్) అభ్యర్థి ఎస్ శ్రీశైలంపై రాంగోపాల్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీశైలం శుక్రవారం నల్లగుట్టలో ప్రచారం చేస్తున్నారు. ఆయనతో పాటు ఉన్న అనుచరులు ఇంటింటికి ప్రచారం చేస్తూ బాణసంచా కాలుస్తూ నిబంధనలు ఉల్లంఘించారు. దీనిపై సమాచారం అందుకున్న ఎన్నికల అధికారులు వచ్చి పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేయగా శ్రీశైలంపై కేసు నమోదు చేశారు.

తాను కోరిన గుర్తు కేటాయించలేదని ఫిర్యాదు

రాంగోపాల్‌పేట్: సనత్‌నగర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దురుద్దేశంతో తాను కోరిన గుర్తును కేటాయించలేదని తెలంగాణ చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ వికాస్‌రాజ్‌కు స్వతంత్ర అభ్యర్థి ఏ శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. నామినేషన్ పత్రాల్లో తాను ట్రక్కు, డైమండ్, పెన్ను గుర్తుల కేటాయించాలని కోరానని ట్రక్కు గుర్తు ఎవరు అడగకపోయినా ఉద్దేశపూర్వకంగా రిటర్నింగ్ అధికారి తనకు డైమండ్ గుర్తు కేటాయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక సింబల్‌ను ఎక్కువ మంది అడిగితే లాటరీ ద్వారా దాన్ని కేటాయిస్తారని ట్రక్కు గుర్తు ఎవరూ అడగలేదు, ఎవరికి ఇవ్వలేదని కానీ ఉద్దేశపూర్వంగా తనకు అన్యాయం చేశారని ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్‌కు కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశానన్నారు.